# చీకటి వెలుగులు

శ్రీమతి పరాసేని శ్రీశైలభ్రమరాంబ

కళ్లు పొడుచుకున్నా కానరాని అమావాస్యకటికి చీకటిలో గాఢాంధకార బంధురమైన ఆ కాళరాత్రి సమయంలో నిర్మానుష్యంగా వుందావీధి. అక్కడక్కడ కుక్కల మొరుగులు, కీచురాళ్లరొద తప్పించి అంతా నిశ్శబ్దమయం. రక్తాన్ని చెమటగా మార్చి శ్రమించి, రాళ్లను పువ్వుల్లామోసి అబ్బాయి బువ్వకోసం బాధపడ్తూ, ఆత్మహత్య చేసుకోడానికి మనసొప్పక కన్నీళ్లతోనే మండిన గుండెలార్చుకొంటూ, బాబును నిద్రపుచ్చేసమయమది. జీవితంలో కష్టాలను బ్రతుకులో భారాన్ని మరచి, ఆదమరచి పోవడానికే అబ్బాయిని ఉయ్యాల్లో ఊపుతోంది అభాగిని _ తాను తినకపోయినా బిడ్డకు కడుపారా బువ్వపెట్టి, ఎండిన రొమ్ములోని రక్తాన్నికూడా పీల్చి నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నాడాబాలుడు_

ఆ పూరింటికి కొంచెందూరంలోనే ఎత్తైయిన మేడలో మెత్తని పాన్పుమీద పరుండి రేడియో సంగీతం వింటూన్నాడు ముకుందరావు. ఆ ఆనంద గీతానికి తోడుగా ఓ అభాగిని జోలపాటపాడ్తోంది. కాని నిజానికి అది జోలపాటు కాదు; బిడ్డని లాలించి ఉయ్యాల ఊపే లాలిపాట కాదు; హృదయాన్ని కదిలించే బాధ-రాళ్లను సహితం కరిగించే గాథ-ఒక అభాగిని ఆక్రందన, ఎవ్వరూ విని సహించలేని వేదన - ఎంతటి బాధనైనా ఓర్చుకునే సహనశక్తి భారతస్త్రీకి ఉగ్గుపాలతో పెట్టినవిద్య - ఆ ఉయ్యాలా ఊపుతున్న అభాగినే శ్యామల. ఆమె ఏకైక పుత్రుడే బాబు. ఆమె భర్త ముకుందరావు. అతడే స్త్రీతో పరమానందంగా పూల పాన్పుపై ఆనందిస్తున్నాడు.

అందరిలాగే శ్యామలకూడా తీయతీయని కలలు కంటూ ఆదర్శగృహిణిగా జీవించాలని ఆశించింది. తనభర్త ఉన్నతోద్యోగి అవ్వాలనీ, తను తనభర్త జట్టాపటా వేసుకు షైర్లకి, సినిమాలకి, పార్కులకి వెళ్లాలనీ క్షణమైనా విడలేని అన్యోన్యానురాగంతో తమ దాంపత్యం వర్ధిల్లాలని, ఎన్నో - కలలుకంది ఆమె - కాని తనకలలన్నీ కలలుగానే కరిగిపోయాయి - తన పెళ్ళికిచేసిన వేడుకల్లో, వినోదాలో భోగంమేళం మొట్టమొదటగా ముకుందరావుని ఆకర్షించింది - ఆ ఆకర్షణ ఫలితమే అతడు వేశ్యాలోలుడయ్యాడు - అంతటితో ఆగక త్రాగుడుకు లోనయ్యాడు.

పగలు కొన్ని గంటలకాలం షాపులోపనిచేస్తూండడం చీకటిపడేసరికి సాని ఇంటికి వెడ్తూండడం, ఇదే తన దినచర్య. తన భర్త త్రాగుబోతు, తిరుగుబోతు అని తెల్సుకోడానికి ఎంతో కాలం పట్టలేదుశ్యామలకి- వివాహమైన ఆరుమాసాల్లో ముకుందరావు పరిస్థితి నంతా అర్థంచేసుకుందామె. కాని తమదాంపత్య అనుబంధానికి ప్రతిఫలంగా తనకడుపులో ఒక పాప పెరుగుతోందని గుర్తించుకొన్న ఆమె తన దుఃఖాలు ఒకదరికి జేరగలవని ఆనందించింది. తను గర్భిణీతో వున్నానని తెల్సుకొన్నాక అయినా తన భర్తలో పరివర్తన కల్గుతుందని ఆశించింది. కాని శ్యామల కోరిక ఫలించనేలేదు.

శ్యామల గర్భఫలం ఫలించి మగపిల్లవాడు పుట్టాడు - కొడుకుపుట్టిన తర్వాతకూడా ముకుందరావులో ఏమి మార్పురాలేదు - చేతుల్లో పైకంలేని రోజుల్లో తప్ప త్రాగి రాత్రికి ఇంటికివచ్చి కొట్టేసిన పాములాపడి వుండేవాడు. అతను వచ్చేసరికి ఎంత రాత్రయినా ఆమే మేలుకునేవుండి అతనికి కడుపారా భోజనంపెట్టేది, అతడు తిట్టేతిట్లను బూతుల్ని భూమాతలాసహిస్తూ, తననికానట్లే ఓర్పుతో వినేది. అతను పెట్టేబాధలన్ని సహించి, అతనికి ఉపచారాలుచేసి అలసిపోయి ఎప్పుడో అతని పాదాలదగ్గరే నిద్రించేది. ఈ విధంగానే ఆమె ప్రసవించేవరకూ అతనికి శుశ్రూషచేసేది _

శ్యామల ప్రసవించేముందు ఓ నాటి అర్ధరాత్రి

సమయాన ముకుందరావు ఇంట్లో సామానంతా తీసుకుని, ఆమెను ఒంటరిగావదిలేసి వేశ్యతో సహా మకాం ఎత్తేశాడు.

కని పెంచిన కన్నవారు, ఆదుకోవలసిన అత్తవారూ లేని నిరాధారజీవి శ్యామల. ఇరుగుపొరుగు వారి సహాయంతో ఒక పూరింట్లో నివాసంవుంది – ఒక సుముహూర్తాన పుత్రోదయమైంది. ఎంత ఆదరాభిమానములతో చూచేవారైనా పొరుగువారు మాత్రం ఎంతకాలం తల్లీబిడ్డల్ని పోషించగలరు? బ్రతుకుతెరువు కోసం కూలిపనికి పోతుండేది. పగలంతా కష్టించి పనిచేసి సాయంత్రానికి ఇల్లుచేరి తన బాబును చూసి మురిసిపోయేది. పోలికలో ముమ్మూర్తులా తండ్రినే పోలిన తన బాబును చూచి తండ్రివంటి నీచపుబ్రతుకు మాత్రం తన బిడ్డకురాకుండా చెయ్యమని భగవంతుని ప్రార్థించేది ఆమె –

రోజూ రాత్రిళ్లు తన బాబుని ప్రక్కలో పడుకోబెట్టుకు ఆనందంతో పొంగిపోయేది. అంతంలేని ఆవేదన, భరించరాని బాధలు, కడుపారా తిండికికూడా కరువైన తనబ్రతుకులోని కరువు, తనకింక దూరమౌతుందని అమాయికమైన కళ్లతో, ఆనందజ్యోతిలా వెలిగే బాబు ముఖంచూచాక తన భర్తలో తప్పక పరివర్తన కల్గి తననీ తన బిడ్డనీ ఆదరిస్తాడని తన ఆశలు ఆశయాలు నెరవేరి కోరికలన్నీ కొనసాగే మంచిరోజులొస్తాయని ఎంతో మురిసిపోయేది ఆమె. పెండ్లి అయిన క్రొత్తలో గడిపిన కొద్దిరోజులు ఆమెస్మృతిపథంలో ఎప్పుడూ మెరుస్తూ కన్పించేవి ఆమెకి – మళ్లీ ఆరోజులు వస్తాయని రాత్రింబగళ్లు ఎదురుచూస్తూండేది –

బాబు పుట్టిన ఆరునెలలకి ఒకరోజు హఠాత్తుగా ముకుందరావు సర్వంపోగొట్టుకొని ఇంటికివచ్చాడు. నిర్ధనుడైనందుకు తన దుస్థితికి విచారించవల్సినదానికి బదులుగా భార్యను హింసపెట్టేవాడు ముకుందరావు. ఒకప్పుడు శ్రీమంతుడై వ్యాపారధర్మాల్ని బాగా తెలిసినవాడు కాబట్టి లారీమీద కొబ్బరికాయల ఎగుమతి చెయ్యడంలోనూ కొబ్బరికుడి: కటకటా, గండేరా, కటిక్కాయ. నీటికాయ. కొబ్బరిలోని అన్నిరకాల నాణ్యతలు చూస్తుండడానికై ఓకొట్లో ప్రవేశించాడు. ఆ డబ్బు అసరాచూచుకొని మళ్లీ మేడమీద వేశ్యతో బంధుత్వం కల్పుకున్నాడు ముకుందరావు –

ముకుందరావు కొడుకుని కళ్లారాచూచి, చేతులారా ఏనాడూ ఎత్తుకోలేదు. ఇదివరకైతే నోరు పారేసుకునేవాడేకాని ఇప్పుడు మాత్రం చెయ్యిచేసుకోవడం ప్రారంభించాడు–స్త్రీ జాతికి "సహనమే" పెట్టని ఆభరణం. అందులోనూ పసితనంలోనే తల్లిదండ్రులు కరువైన శ్యామల కష్టాల్లోనే పెరిగింది. ఎన్ని కష్టాలువచ్చినా, భరించినా వుత్తమలక్ష్యాలు వున్నతాశయాలు వున్నశ్యామల ఎదురు తిరిగి భర్తకు ఏనాడూ జవాబివ్వలేదు – తనలోతనే కుమిలికుమిలి ఏడ్చేది – తనభర్తకి త్రాగుడు అలవాటుచేసిన వేశ్యలదా నేరం? తన భర్తదా? తనభర్త స్థితికి, ఆతనిమనో దౌర్బల్యానికి–ఆతని దుష్టసాంగత్యానికి జాలిపడేది. తన భర్త సత్ప్రవర్తన గలవాడయ్యేటట్లు చెయ్యమని దైవాన్ని ప్రార్థించేది – అన్యాయం. అవినీతి, స్వార్థం పెరిగిపోయిన ఈ సంఘంలో కొత్తగా అడుగుపెట్టబోయే తన ఏడాది కొడుకునీ చూచుకొంటూ, భర్త భవిష్యత్‌ను తలపోస్తూ గుండెలు పగిలేటట్లు ఏడ్చేది –

తన భర్త తనని కొట్టి, తిట్టి, హింసిస్తున్నాడని ఏనాడూ బాధపడలేదా యిల్లాలు. మహాఘోరమైన త్రాగుడికి అలవాటైతన భర్త ఏమౌతాడో! దుస్సాంగత్య ఫలితంగా ఆతనిలోని వ్యాధులు చివరికి ఆతని నేపరిస్థితికి తీసుకుపోతాయో: అని విలపించేది. ఆమె అభావితోనే మానసిక వేదనతో ఆమె చిక్కి శల్యమైపోయింది. ఆమెలోని సౌందర్య, యువ్వనం నామరూపాలు లేకుండా అడుగంటాయి. తన్ను గురించి తను బ్రతక్కబోయినా పరవాలేదనే నిర్లక్ష్యంతో తన్నుతాను నాశనంచేసుకున్నా, ఉజ్వలభవిష్యత్తున్న తన బాబుమాత్రం అభివృద్ధికి రావాలని ఆశించేది –

ఒకనాడు బాబుకి కొంచెం జ్వరంవస్తే అవీధినే వున్న రామయ్యగారనే వైద్యుని దగ్గరకు వెళ్లి మాత్రలుతెచ్చి వేసింది శ్యామల. వారంరోజులు బాబుకు జ్వరంతోవుంటే ఒక్కనాడైనా ముకుందరావు గుమ్మంలోకిరాలేదు – శ్యామల ఒంటరితనాన్ని గుర్తించినిరామయ్య మాత్రం మందుకు లోటుచెయ్యకుండా కనశక్తి వంచనలేకుండా వైద్యం చేస్తున్నాడు – రామయ్యకూతురు అనసూయ కూడా రాత్రిబగళ్లు శ్యామలకు సహాయంగావుండేది.

నెలరోజులైనా బాబుకు వచ్చిన జ్వరం తిరుగుముఖం పట్టలేదు. మధ్య మధ్య "నాన్న" అనికలవరిస్తు శ్యామలకి గుండెల్లోగునపంతో పొడిచినట్లుగావుంది. రామయ్య అనసూయ మాత్రం యేం చెయ్యగలరు –?

ఆ రాత్రి కాళరాత్రి - భయంకర రాత్రి. మరపురాని రాత్రి. ఆ పూరింట్లో గుడ్డిగా వెలుగుతోందొక బుడ్డి దీపం, నులకమంచంమీద బాబును ఒళ్లో పెట్టుకుని కూర్చుంది శ్యామల. అనసూయకి కూడా లోకానుభవం అంటే ఏమిటో తెలియకపోయినా, ఇంకా భర్త, కాపురం, వివాహం అంటేకూడా అర్థం చేసుకోలేని అమాయకురాలైనా శ్యామల స్థితిని గుర్తించాక జీవితాంతం కన్యాత్వంలోనే గడుపుదామనేటంత విరక్తిలోకి వచ్చింది. ముకుందరావుని మనస్సులో శతసహస్ర శాపనార్థాలు పెట్టుకుంటూ, శ్యామల స్థితికి విచారపడ్తూ, బాబు ఎల్లా వుంటాడో అని ఆదుర్దాతో ఆమెకు సహాయంగా కూర్చుంది అనసూయ—

పెద్ద డాక్టరును తీసుకొస్తేనే కాని బాబు బ్రతకడని రామయ్యకు తెలుసు. అయినా తనేం చెయ్యగలడు? తను ఏవో ఆయుర్వేదమందులు కొన్ని తెచ్చుకుని, చిన్న చిన్న జబ్బులకు వాడుతూ, దానివల్ల వచ్చే డబ్బుతోనే తనూ, తనకూతురు అనసూయా జీవయాత్ర చేస్తున్నారు. అనసూయకు ఇరవై ఏళ్లువచ్చినా తను బీదవాడు కావడంచేతనే ఆమెకు పెళ్లికూడా చెయ్యలేకపోతున్నాడు. ఒకపూట వుంటే రెండోపూట భత్యానికి తడుముకులాడే స్థితి రామయ్యది — తను చెప్పినాకాని పెద్ద డాక్టరు రాడు. ఫీజు ఇవ్వందే పిలుస్తేకూడా పలుకడు. ఇంక ఏమీ చెయ్యలేక బాబు ముఖంలోకి చూస్తూ కూర్చున్నాడు.

"నాన్న" అని కలవరించాడు బాబు, కళ్లువిప్పి చూచి అమ్మా నాన్న అంటూ మళ్లీ కళ్లుమూశాడు. శ్యామలకి ఎటూ పాలుపోవడం లేదు. క్షణక్షణానికి జ్వరతీవ్రత హెచ్చిపోయి, బాబు నాన్న, నాన్న అని తెగకలవరించేస్తున్నాడు — తన భర్తని తీసుకురావాలని రామయ్య వెళ్లాడు. కాని గుమ్మందగ్గర నుంచే అతన్ని సాగనంపేరు. చివరకు అనసూయ కూడా సాహసించి వెళ్లింది — శ్యామల దుఃఖం చూడలేక. ఆమెను గేటుదాటి లోపలికి రానివ్వలేదు — రామయ్య, అనసూయ కలిసివెళ్లి పెద్ద డాక్టరును కూడా వేడుకున్నారు. అథమం అయిదు రూపాయిలైనా ఇస్తేకాని చూడ్డానికే రానని భీష్మించుకు కూర్చున్నాడు పెద్దడాక్టరు. చిట్టచివరకు శ్యామలకు చెప్పాడు రామయ్య—

శ్యామల దృష్టిలో తన కొడుకును బ్రతికించగలవాడొక్క డాక్టరు మాత్రమే - తన బాబును కాపాడే దేవతామూర్తి డాక్టరే - ఆ డాక్టరుకి అయిదు రూపాయిలివ్వాలి అవి తనకెల్లా వస్తాయి? తన మెడలోని పవిత్రమాంగల్యాలు కూడా భర్త బలాత్కారంగా తీసుకుపోయి త్రాగుడికి ఆహుతి చేశాడు. ఇంక తనేం చెయ్యాలి? వెళ్లి డాక్టరు కాళ్లమీద పడి వేడుకుందామని తనే వెళ్లి డాక్టరుగారి తలుపులు తన శక్తికొద్దీ బడబడా కొట్టి నోరునొప్పి పెట్టేవరకూ అరిచింది. కాని ఇల్లాంటి అభాగినుల పిలుపుకి ఆ ప్రయివేటు డాక్టరు తిరిగి జవాబైనా ఇవ్వలేదు. చివరకు విసుగెత్తి తనబాబు దగ్గరకి వచ్చింది శ్యామల.

బాబు పరిస్థితి బాగా శ్రుతిమించిపోయింది. విపరీతంగా మూల్గుతున్నాడు. ఆ మూల్గులోనే "నాన్న" అని అంటున్నాడు అస్పష్టంగా. "అక్కయ్యగారూ! ముకుందరావుగారు వస్తే ఎల్లాగైనా డాక్టరుని తీసుకురాగలరు. ఈ ఆఖరుసమయంలో బాబుని..." ఇంక చెప్పలేకపోయింది అనసూయ

"ముకుందరావుగారి దగ్గర ఎంతటి వాళ్లనైనా వశపర్చుకోనే సామర్థ్యం వుంది. ఆయన వస్తే బాబు జీవించవచ్చు" అన్నాడు రామయ్య

ఇంక బాబు విషయంలో వారిద్దరూ అల్లా చెప్పేసరికి శ్యామల మనస్సు తల్లడిల్లిపోయింది. అరిచింది. ఏడ్చింది-అందరు దేవుళ్లను ప్రార్థించింది. భర్త!... ఆమెకున్న ఆశ ఇంక అదొక్కటే... ఆ చీకట్లో చిన్న ఆశాకిరణం...అదే-తన కందుబాటులో లేని ఆ పెద్దమేడలో పై అంతస్థుమీద తనభర్త ఆ రాణీ ఆనందబాహువుల్లో హాయిగా నిదురిస్తూంటాడు... ఒక్కసారిగా బాబు ముఖంలోకి చూచింది. "న...న్న..." అని ఒణికే పెదవుల్తో అస్పష్టంగా అంటున్నాడు బాబు.

"బాబూ! మీ నాన్నని తీసుకువస్తా! నిన్ను బ్రతికించుకుంటా!! నాయనా!!!" అంటూ అరిచింది. ఇంక ఆ తల్లి వెనకాముందూ ఆలోచించలేదు. ఆమె మాతృప్రేమకి కటిక-చీకటి కూడా అడ్డురాలేదు - విడిపోయిన జుట్టుకూడా ముడి వేసుకోవాలన్నా గుర్తుకూడా ఆమెకు లేదు.

ఒక్క పరుగున ఆ పెద్దమేడ దగ్గరకు వచ్చింది. ముందు గేటుకు పెద్దతాళం వేసివుంది. అయినా ఆ

తలుపులు తాళంకూడా పసివాడి ప్రాణంకోసం పోరాడే ఆ బీద అమాయకురాలి మాతృప్రేమకు అడ్డం రాలేకపోయాయి - ఎంతమాత్రం సంకోచించకుండా ఒక్క వూపున ఆ ఇనప ఊచలు పట్టుకు గేటుపైకి ఎక్కి లోపలికి ఉరికేసింది వీధి గుమ్మం తలుపు గబగబా బాదుతుంటే అక్కడే చాపమీదపడి గురకపట్టి నిద్రపోతోన్న నౌకరు లేచి ఎవరు వారు? అన్నాడు.

"వీధి తలుపులు తీయించు - ముకుందరావుగారు కావాలి" అంది శ్యామల

"ఇప్పుడేంటమ్మా! అర్ధరాత్రి వేళ - నిద్దర్లో వున్నారు" అన్నాడు అతడు కళ్లు నులుపుకొంటూ.

"వారి అబ్బాయి చాలా జబ్బుగా వున్నాడు. వారిని త్వరగా తీసుకెళ్లాలి" అంది ఆతృతగా.

"ఏమో! ఆ గొడవేంటో నాకేం అక్కర్లేదు. పొద్దున్నగాని అరు లెగరులెండి" అన్నాడు అతడు బిగ్గరగా.

"మా బాబుకి చాలా జబ్బుగా వుంది. ఆయన కోసం కలవరిస్తున్నాడు. నేను ముకుందరావుగారి భార్యను. ఒక్కసారి లేపు నాయనా!" దీనాతి దీనంగా వేడుకొంది ఆమె.

"అసలు అర్ధరాత్రికాడ లేపితేనే అమ్మగారూరుకోరు. అందులోనూ ఇక్కడ కొచ్చేవోళ్ల పెళ్లాలంటే ఇంకేమన్నా వుందా! అగ్గయిపోతారు నా మీద. నా కూట్లో దుమ్ము పోసుకోలేను అమ్మగారూ - పొద్దున్నే రండి" అని చెప్పాడు.

"సరే! అల్లాగైతే నేనే లేపుతానులే" అంటూ తలుపు గబగబా గుద్దడం ప్రారంభించింది శ్యామల.

"అయ్య బాబయ్య బాబో! ఆరూరుకోరండి. నన్ను సంపేత్తారమ్మగోరో! అసలు గేటు తలుపే తియ్యనివ్వరు మీరెల్లాగొచ్చారో యేంటో!" అంటూ తలుపు తట్టుతూన్న ఆమెను వారించబోయాడు.

"ఏయ్! దూరంగా వుండు" అంటూ గర్జించింది ఆమె.

తన యావచ్ఛక్తిని వినియోగించి తలుపులు బ్రద్దలయ్యేటట్లుగా చాలాసేపు బాదిన తర్వాత "ఎవరు వారు?" అంటూ ఓ ముసలమ్మ వచ్చి తలుపుతీసింది.

"ముకుందరావుగారు ఎక్కడున్నారు?" ఆతృతగా అడిగింది.

"మీరెవరు? ఎందుకోసం వచ్చారు? ముకుందరావుగారితో మీకేం పని?" అంటూ బోలెడు ప్రశ్నలు అడిగింది ఆ వృద్ధురాలు.

ముకుందరావుగారి భార్యను మా బాబుకి జబ్బుగా వుంది. త్వరగా వారు రావాలి" అంది గాభరాగా.

"ఇందుకా అర్ధరాత్రివేళొచ్చావు? ఇంకేం వంక దొరక్క కొడుక్కి రోగం అని ఆయన్ని తీసుకు పోవడానికా? చాలునాల్లే! సంసారివి కావూ?" అంటూ సణుగుడు ప్రారంభించింది ఆ వేశ్యమాత.

"ముందాయన ఎక్కడున్నారో చెప్పు?" గట్టిగా అడిగింది.

"చెప్పకపోతే ఏం చేస్తావేమిటి నన్ను? ఈ అర్ధరాత్రివేళ అరవబోకు! తిన్నగా వచ్చిన త్రోవనే మంచిగా వెళ్లు. కావాలంటే రేపొద్దున్నే వచ్చి నీ మొగుణ్ణి నువ్వు తీసుకువెళ్లొచ్చు" అంటూ సాగతీసుకొంటూ అభినయంతో సలహా చెప్పింది వేశ్యమాత.

"ఇప్పుడు వారిని తీసుకువెళ్లకుండా నేనిక్కడ నుంచి కదలను - చెప్తావా? చెప్పవా?" అంటూ గర్జించి అడిగింది.

"ఇంగో అమ్మాయ్! మర్యాదగా చెప్తున్నాను వెళ్లిపో - ఇది మంచి నిశరాత్రివేళ - హాయిగా మేడమీద నిద్దరపోతున్నాడు. ఈ రాత్రికి నీ మొగుడెక్కడికి పారిపోడులే - వెళ్లు - వెళ్లు" అంటూ చీదరించుకొంటూ చెప్పింది

"తప్పుకో మేడమీదికెళ్లి లేపుతాను" అని తీవ్రంగా అంది.

"వీల్లేదు - నువ్వీ గడపదాటి లోపలికి రావడానికి వీల్లేదు మనిషికి ఓసారి చెబితే చాలదూ?" కోపంగా అంది వేశ్యమాత.

"మనిషిని కాబట్టే కన్నకొడుకు ప్రాణంమీదికి వస్తే కట్టుకున్న భర్తకోసం నీ యింటికి వచ్చాను. వారిని పంపించు" అంది ప్రాధేయతగా.

"ఇప్పుడు మాత్రం అమ్మాయికి నిద్రాభంగం చెయ్యడానికి వీల్లేదు - పొద్దున్నే లేపి పంపుతానులే" నక్క వినయంతో చెప్పింది.

"నా బాబుకంటె నీ కూతురు నిద్ర చెడిపోతే మరేం ప్రమాదంలేదు" అంటూ గుమ్మానికి అడ్డంగా నిల్చున్న ముసలి వేశ్యమాతను ఒక్క గెంటుతో ప్రక్కకు నెట్టి రివ్వున ఇంట్లోకి జొరబడింది. నాల్గు వైపులా వెదికి మేడమెట్లున్న గదిలోకి వెళ్లి గబగబా మేడ ఎక్కేసింది - తిన్నగా పడకగది తలుపులు ధడీధడీ బ్రద్దలు కొట్టేటట్లు కొట్టింది. "ఎవరు?" అంటూ రాణీ లేచివచ్చి తలుపు తీసింది.

(సశేషం)

# చీకటి వెలుగులు

శ్రీమతి పతానేని శ్రీశైలలక్ష్మమరాంబ

(గత సంచిక తరువాయి)

ఎదురుగా మంచంమీద ముకుందరావు హాయిగా గుండెలమీద చెయ్యివేసుకు పడుకున్నాడు. అర్ధరాత్రి వేళ పిడుగులు పడ్డట్టుగా తలుపులు గుద్దిన చప్పుడుకి ప్రక్కనున్న రాణీ కేవలంచేత కొంచెం కళ్ళువిప్పి గుమ్మంవైపు చూస్తున్నాడు. ఎదురుగా భర్త కనిపించేసరికి శ్యామలకి ఒక్కసారిగా దుఃఖం పొంగి పొర్లివచ్చింది. కాని ఆ సమయంలో ధైర్యం చిక్కపట్టుకొని "మా అబ్బాయికి చాలా జబ్బుగా వుంది వారిని ఓసారి పంపించండి" అంది నెమ్మదిగా

ఆమాటవిని ఉలిక్కిపడి లేచి మంచం మీద కూర్చున్నాడు ముకుందరావు.

"మీరెవరమ్మ? ఎవరికోసం వచ్చారు?" అనడిగింది రాణి —

"నేను ముకుందరావుగారి భార్యను — మా బాబు చాలా ప్రమాదస్థితిలోవుండి నాన్నకోసం కలవరిస్తున్నాడు — ఒక్కసారి అర్జంటుగా వారిని పంపించండి. బాబునిచూడాలి" అంది ఎంతో బాధతో శ్యామల —

అంతలో ఆయాసపడూ, రొప్పుకొంటు రొజుకొంటూ, ఒగర్చుకొంటూ అక్కడికొచ్చింది వేశ్యమాత —

"ఏమండి? మీ అబ్బాయికి జబ్బుగావుందా?" అంది రాణి —

"ఏమో! నాకు తెలీదు రాణీ! నేనింటికెళ్ళి అప్పుడే నెలకావస్తోంది" అన్నాడు ముకుందరావు.

"అదంతా ఒట్టినాటకం — మొగుణ్ణిలాక్కుపోవడానికి వేసిన ఎత్తు" అంటూ గుమ్మందగ్గరగా వచ్చి నిలిచింది వేశ్యమాత —

"నా మాటనమ్మండి. బాబుకి జబ్బు చాలా ప్రమాదస్థితిలోవుంది. డబ్బులేకుండా డాక్టరుగారు రానన్నారట. రామయ్యగారినీ అనసూయనీ, బాబు దగ్గరవుంచి మీకోసం వచ్చా — త్వరగా రండి"

"అబ్బో! నీలాంటి సంగసాచుల్ని కావలసినంతమందినిచూచాను. పెళ్ళాంపోయిన రామయ్యనీ యిల్లు పట్టాడుగా — ఇంకా మొగుడెందుకు? ఎంతటి జాణవూ కాకపోతే — గోడదాటి గోడలు దూకి అర్థరాత్రి రాగలధైర్యశాలివి నువ్వొకటే పనికైనా సాహసించగలవు. వెళ్ళు చాల్లే. నీ నక్కజిత్తులు" అంటూ ఎంతో ఈసడింపుగా అంది వేశ్యమాత —

"ఏమండీ! మన బాబుకోసంరారూ?" ఎంతో దుఃఖభారంతో భర్తముఖంలోకి దీనంగా చూస్తూ వేడుకుందామె —

"వస్తారులెండి — మీరు వెళ్ళండి" అంది నిర్లక్ష్యంగా రాణి —

"మన బాబు నాన్నా నాన్నా అంటూ కలవరిస్తున్నాడు — త్వరగా రండి. మీకోసమేవచ్చాను ఈ ఒక్కసారి నామాటవినండి. మీకాళ్ళు పట్టుకువేడుకుంటా — మన అబ్బాయి..." అంటూ శ్యామల ముకుందరావు రెండుకాళ్ళూ పట్టుకుంది —

రాణికళ్ళు, తల్లి కళ్ళు కల్పి ఏదో సంజ్ఞాపూర్వకంగా మాట్లాడుకొంటున్నాయి — కన్నతల్లి కడుపు మంటతో తల ఎత్తిచూచే స్థితిలోకూడా ఆమెలేదు — కన్నీళ్ళతో భర్త పాదాలను తడుపుతూ కన్నకొడుకు కోసం రమ్మని ప్రార్థించుకొంటూంది — అతని మనస్సు కూడా ద్రవించి పోతోంది —

"తెల్లవారాక వెళ్ళొచ్చు — త్వరగా [illegible]

పంపించండి - అర్ధరాత్రివేళ ఏమిటీ ఘోష కొంపలో — ఇదంతా నటనగాని నిజమనిమాత్రం నమ్మకండి" అంది రాణీ —

ముకుందరావు మనస్సు దేవేస్తోంది. తనఇల్లాలుతో సమానమైన ఉత్తమురాలు లేదని అతని అంతరాత్మను తెలుసు. ఆమె కలలోకూడా అబద్ధమాడని పరమపావని అని అతని హృదయం ఘోషిస్తోంది పాదాల మీద భార్య, ప్రక్కన ప్రియురాలు అతనిలోని మానవత్వం ఘోష పెడ్తోంది — బిడ్డకోసం ముందుకు పోవాలా? ప్రేయసికోసం ఆగిపోవాలా? కొన్ని క్షణాలు ఆలోచిస్తూ అలాగే నిల్చుండి పోయాడు — అతనిలోని పితృ ప్రేమ, ప్రియురాలి ప్రేమక్షణకాలం పెనుగులాడాయి. పశివాడి ప్రాణంకోసం తహతహతో తల్లి తన పాదాలమీద మోకరించింది. నవ్వించి. కవ్వించి ఆనందపర్చే వేశ్య ఆగమంటోంది. తను ఇప్పుడు రాణిమాట కాదని వెళ్లిపోతే తిరిగి ఈ గుమ్మంత్రొక్కనీయరు. ఎముకల పుట్టవంటి భార్యతో తను సుఖించలేదు — చివరకు అతనిలోని కామమే జయించింది. స్వార్థం పిరికితనం అతనిలో ఆవేశించాయి —

"ఈ అర్ధరాత్రి సమయంలో నేనువచ్చి మాత్రం చెయ్యగలిగిందేముంది? ప్రొద్దున్నే వస్తాను; నువ్వు వెళ్లిపో!" అని దులబరించుకు తనపాదాలు రెండూ ముందుకు తీసుకు మంచందగ్గరకు వచ్చాడు అతడు -

"చెప్పారుగా — ఇంకత్వరగా ఇక్కడనుంచి వెళ్లిపొండి," అంటూ నిస్సాకారంగాచెప్పి రాణీ కూడా మంచందగ్గర నిల్చుంది -

ఆ మాటతో శ్యామలలోని సహనమంతా నశించింది. లేచి నిల్చుంది. "రాణీ! నువ్వుమాత్రం పిల్లలుగల తల్లివికావా? కడుపులో కార్చిచ్చుపెట్టడానికి సిద్ధంగా వున్న కన్నకొడుకుని వదలి కట్టుకున్నభర్త కోసం నీ యింటికివచ్చి అర్థించి అడుగుతున్నా. యీ ఒక్క రాత్రికి నా భర్తని పంపించు — రాణీ! నాకూ నా బాబుకీ వీరు తప్ప లోకంలో "నా" అన్నవాళ్లెవరూలేరు. సాటి ఆడదాని బాధ, కష్టం అర్థంచేసుకు ఒక్కసారి పంపించు — ఇవి నీ చేతులు కావు కాళ్లుగా భావిం నా బాబుకోసం ..." ఇంక చెప్పలేకపోయిం —

"సంసారివైనా బలే లెక్చర్ చేర్పుతున్నావు! ఇంతబాగా అభినయించటం నేనెక్కడ చూడలే ఇంతవరకు" అంటూ దర్జాగా అంది రాణీ —

"రాణీ! నువ్వు వృత్తికి వేశ్యవైనా మానవత్వం మాతృత్వం అయినా నీలోవుండి సాటి స్త్రీ మీద జాలిపడి నీ ధర్మాన్ని నువ్వు నెరవేర్చి నా భర్తను పంపిస్తావనుకొన్నాను. కాని సానులైన వారి మనస్సులు సానరాళ్లవంటివనుకోలేదు—నీచురాలా! కావాలంటే వచ్చి నాబాబు ఏస్థితిలో వున్నాడో కళ్లతో చూడు — ఈ నాడు కండకావరంలో కళ్ళు కప్పి కన్న తండ్రినీ బిడ్డనుంచి దూరంచెయ్యకు. నా భర్తని పంపించు నువ్వు పంపకపోతే నేనే తీసుకు వెడ్తా—నేను వారి భార్యని" అంటూ రాణీని ఓ చీడపురుగుని చూచినట్లు చూచి భర్తముందు నిల్చుంది శ్యామల -

"ఏయ్! మాటలు తిన్నగా రానీయ్! అర్ధరాత్రిప్పుడు దొంగలా నాయింటికెవరు రమ్మన్నారు. నీకాపాటి శక్తివుంటే నీ భర్తని ఎల్లాతీసుకెడ్తావో నేనూ చూస్తా. నువ్వు కొట్టుకుచచ్చినా ఆయనీరాత్రికి రారు. ఏంచేస్తావో చెయ్యి!" అంటూ అతడి ముఖంలోకి చూచింది రాణి —

భార్యముఖంలోని దీనత్వం, కళ్లలోని కన్నీరు కంటే, వెలయాలి ముఖంలోని చిరునవ్వే అతన్ని బంధించివేశాయి.

"నేను వస్తానని చెప్తుతుంటే నీకాదూ? ఇక్కడి నుంచి వెళ్లిపో" కఠోరంగా ఆజ్ఞాపించాడు అతను —

ఆ మాటతో ఆమెలో ఆవేశం దుఃఖం ఎక్కువయ్యాయి" అదేంమాటండీ? కన్నకొడుకంటే ఒక్క రాత్రికి మీ ఆనందం ఎక్కువా? కట్టుకొన్న భార్య, కన్న బిడ్డ అక్కడదురంత దుఃఖంలోవుంటే ఇక్కడ మీరు వినోదంగా వుంటారా? ముందు బాబుదగ్గరకి రండి. తండ్రిగా వాడిని పల్కరించి బ్రతికించండి" అంటూ రుద్రకాళీ స్వరూపందాల్చి అడిగింది ఆమె—

"నేను రాను — ముందు ఇక్కడినుంచి కదుల్తావా? లేదా?" గర్జించాడు అతడు —

"రావాలి! బాబు కోసం మీరువచ్చితీరాలి!! నాకన్నకొడుకుకంటే నాకేం ఎక్కువలేదండి!!!" అంటూ ఉద్రేకంతో భర్తచేతిని గట్టిగాపట్టుకు బరబరా ముందుకులాక్కొచ్చింది ఆమె - ఆమె భయంకర స్వరూపానికి ఒణికిపోతూ రెండడుగులు ముందుకి వేశాడు ముకుందరావు —

"ఆయన్ని తీసుకువెళ్లడానికి వీల్లేదు" అంటూ

అరుస్తూ ఓ చెయ్యి రాణి! రెండో చెయ్యి వేశ్యమాత పట్టుకున్నారు.

"ముందు నాతో రండి" అంటూ అతని చొక్కా పట్టుకు లాగింది శ్యామల –

"మొగ మహారాజువి చెప్తున్నా కాని వినని ఆడది భయభక్తులున్నదేనా? రెండు తన్ని గెంటిపారేస్తే కదలకేం చేస్తుందంట?" అంటూ ప్రబోధం చేసింది వేశ్యమాత –

కావల్సిన కార్యక్రమాన్ని కళ్లతోనే చెప్పింది రాణి – దుర్బలుడైన భర్త "పోతావా పోవా?" అని రెండు తన్నాడు ఆ మహాసాధ్విని -

"బాబు మనబాబు కోసం రండి—కన్న కొడుకు-పోనీ అయిదురూపాయిలివ్వండి. బాబును బ్రతికించుకుంటాను." అంటూ క్రిందపడిన ఆమె గోడు గోడున ఏడ్చింది.

ఆ కర్కశహృదయాలముందు ఆమె రోదన అరణ్యరోదన అయిపోయింది. మేడ మెట్లమీంచి క్రిందకి త్రోసి వెయ్యబడింది.

"మీరు మనుషులా, రాక్షసులా? కడుపెడు దుఃఖంతో వచ్చిననన్ను ఇల్లా చేస్తారా?" అంటూ నుదురుమీంచీ, చేతులమీదనుంచి రక్తం కారుతోన్నా లెక్ఖచెయ్యకుండా కొడుకుకోసం ప్రాణాల్నికూడా తెగించిపోరాడేందుకై లేచి నిల్చుంది ఆ సాధ్వి –

హృదయ విదారకమైన ఆమె ఆక్రందన ఆ మదాంధులు వినకుండా బరబరా గేటు బయటకు ఈడ్చివేసి తాళంవేశారు - భోయన ఏడుస్తూ బాబు కోసం పరుగెత్తుకువచ్చింది. బాబు సన్నగా మూల్గుతున్నాడు: ఆమె భీభత్సరూపాన్ని చూచి రామయ్య అనసూయ హడలిపోయారు –

"నా బాబుని ఇంకెవ్వరూ బ్రతికించలేరా?" అంటూ అరచింది ఆ తల్లి –

"అమ్మాయీ! కష్టాల్లోవున్న వాళ్లనే దేవుడు పరీక్షిస్తాడు. ఇంక మనం చెయ్యవల్సిందేమీ లేదు – అంతా దైవనిర్ణయం" అని నిట్టూర్చి చెప్పాడు రామయ్య –

"డాక్టరుగారి కాళ్లు పట్టుకు తీసుకొస్తే నా బాబు బ్రతుకుతాడేమో?" ఇంకా ఆశపీడిస్తూంటే అడిగింది

"అన్ని విధాలా నేనడిగానమ్మా! ఇంక ఆయన వస్తాడనుకోవద్దు" అన్నాడు బాధగా రామయ్య -

"పోనీ ముకుందరావుగారు పనిచేసే కొబ్బరికొట్లో వారిని ఏమైనా డబ్బు ఇమ్మంటే... ఇప్పుడు లేసార్తా?" కళ్లంట నీళ్లతో చెప్పింది అనసూయ.

ఇంక ముందు వెనకా ఆలోచించే శక్తినికూడా లేకుండా పిచ్చిదానిగా చేస్తోంది ఆమెలోని మాతృప్రేమ. ఆరాటంతో ఆ రక్తమయమైన ఆకారంతో ఒళ్ళు తెలీకుండా కొబ్బరికొట్టు వైపు పరుగెత్తింది ఆ మాతృమూర్తి - గేటు దగ్గరకు వెళ్ళి "బాబూ" పొలికేక పెట్టింది శ్యామల -

భయంకరమైన ఆమె అరుపుకి ఆ దగ్గర్లోనే చల్ల గాలికి నిద్రపోతున్న కొట్టు యజమాని కొడుకు శ్రీధరం ఖంగారు పడ్తూ ఎవరువారు? అని అడిగాడు—

"బాబూ! నాకొడుకు చాలా జబ్బులోవున్నాడు— ఒక్క అయిదు రూపాయిలివ్వండి. – రేపు ముకుంద రావుగారికిచ్చే సొమ్ములో తీసుకోండి - మాకొడుకుని బ్రతికించుకొంటాం:" అంది హృదయ విదారకమైన రోదన స్వరంతో –

"ఎవతమ్మ? అర్ధరాత్రి వేళ ఆడదానవు వంటరిగా వచ్చావు?" అంటూ టార్చిలైటుతీసి చూచి ఆమె అవతారం గమనించే హడలిపోయాడు అతడు.

"బాబూ! పేదరాలిని. నాకన్నకడుపుని కాపాడండి. ఒక్క అయిదు రూపాయలివ్వండి. డాక్టరుకిచ్చి నా బిడ్డని బ్రతికించుకుంటా. నా బాబే నాకు ఆధారం" అంటూ ఏడుస్తూ చెప్పింది.

"అమ్మా నడవండి — నేను వస్తా" అంటూ అతడు టార్చి లైటు వేసి దారి చూపిస్తున్నాడు. వెనక అతడు వస్తూంటే ముందామె పరుగెత్తుతోంది -

గబగబా ఆ దుర్గాగా తలుపులు బాది "డాక్టరుగారూ!" అంటూ అరుస్తోంది ఆమె. అంతలో శ్రీధరం వచ్చి మీరు ఆగండమ్మా! నేను పిలుస్తాను అని "మిస్టర్ డాక్టర్ నేను శ్రీధరాన్ని—సీరియస్ కేస్. అర్జంటు" అన్నాడు తలుపుదగ్గర - ఆ పిలుపుకి క్షణంలో తలుపు తెరుచుకుంది- "త్వరగారండి చాల ప్రమాదస్థితిలోవున్న కుర్రవాడట" అని పది రూపాయిల కాగితం చేతులో పెట్టేసరికి వెంటనే బయల్దేరాడు వైద్యనారాయణుడు . బాబుని చూచి పెదిమివిరిచాడు .

"డాక్టరుగారూ! నా బాబుని బ్రతికించండి. నా చిట్టితండ్రి బ్రతుకు మీచేతుల్లోవుంది!" అంది ఆమె ఏడుస్తూ –

"డాక్టర్! అసుప్రవానికి చెయ్యవలసినంత వైద్యం చెయ్యండి – డబ్బు నేనిస్తా – ఇక్కడే వుండండి" అన్నాడు ఆతృతగా శ్రీధరం -

డాక్టరు శ్రీధరంకూడా అల్లాగే రెండుగంటలసేపు బాబుకోసం ఎంతో శ్రమపడ్డారు కాని ఇంకా గంట రాత్రివుండగనే డాక్టరు బాబు ముఖంమీదగుడ్డ కప్పేసరికి ఘొల్లుమంది గర్భశోకంతో ఆమాతృమూర్తి–

♦ ♦ ♦

"అమ్మాయీ! శ్యామలా! శ్రీధరంగారు చెప్పినట్లే చెయ్యడమే మంచిదమ్మా! ఆతని మనసులోని చీకటిని పోగొట్టి ఎప్పటికైనా మీ సంసారంలోకి వెలుగువచ్చేలా చూడకపోతే ఎల్లాగమ్మా? నీకు తండ్రివంటివాణ్ణి. ఎందుకు చెపుతున్నానో వినమ్మా!" అంటూ ఎంతోదూరం చెప్పిన తర్వాత చిట్ట చివరకు గత్యంతరంలేక అంగీకరించింది శ్యామల -

ముకుందరావు కొట్లో జీతం పుచ్చుకుపర్సు జేబులో పెట్టుకుని హుషారుగా, వుల్లాసంగా పాటపాడుకొంటూ నడుస్తున్నాడు - కొట్టుదాటి వీధిమలుపు తిరిగేసమయంలో వెనకనుంచి ఆతని ముఖంపై ఎవరో తువ్వాలుపడేసి రివ్వున జేబులోపర్సు తీసుకు సైకిలుమీద వెళ్లిపోయ్యాడు. పాపం మనిషిని గుర్తించలేక సైకిలు వెళ్లినవైపు పరుగెత్తాడు. కాని మనిషి పత్తాయేలేదు - కొట్టు గుమ్మందగ్గర సైకిలు దిగుతూన్న శ్రీధరాన్ని చూచి "ఏమండీ! ఇటువైపు ఇప్పుడే ఎవరైనా సైకిలుమీద వెళ్లడంచూశారా?" అనడిగాడు ముకుందరావు –

"లేదండీ - నేను అల్లా వెళ్లాలని ఇప్పుడే బయటకి వస్తున్నా" అన్నాడు శ్రీధరం.

తన పర్సు కొట్టేసినవానికోసం ఓగంట నానా తంటాలుపడిచివరకు నిరాశతో రాణి ఇంటికివచ్చాడు-

డబ్బుకోసం చూస్తున్న రాణి, ఆమె తల్లికూడా ఖాళీజేబుతోవచ్చిన ముకుందరావుని ఈసడించారు. – వచ్చేనెలకు ఇవ్వబోయే జీతమైనా అడిగితెస్తానని కొట్టుదగ్గరకు వచ్చాడు ముకుందరావు –

కొట్టుయజమాని, ఆతని కొడుకు శ్రీధరంకూడా తమకింక గుమాస్తా అక్కర్లేదని ముకుందరావుఉద్యోగానికి వీడ్కోలిచ్చి సాగనంపారు - వారంరోజులు ఆతడు ఎక్కడికి నౌకరీకోసం వెడితే అక్కడే శ్రీధరం కన్పిస్తుండడం, తనకి ఎక్కడాపని దొరక్కపోవడంతో రాణీదగ్గరకు వచ్చి తనకష్టాన్నంతా చెప్పుకొన్నాడు – "డబ్బులేకుండానిన్ను కూర్చోబెట్టుకు మేపడానికి నేనేమీ కట్టుకున్న పెళ్లాన్ని కాదు పో! పో"మ్మని ఆనాడు తనభార్యకి జరిగిన పరాభవమే తనకిచేసి గేటుబయటకి సాగనంపారు -

ఆనాడు రాత్రి తనభార్య వచ్చి వెళ్లాక ఈపక్షం రోజులూకూడా బాబు ఏమయ్యాడో ఆతనికి గుర్తు రాలేదు. కాని ఈ నాడు మాత్రం ఇల్లాలు, ఆమె కార్చినకన్నీరు, తను పెట్టినబాధలు కళ్లముందు కన్పిస్తూంటే పూరింటికి పరుగెత్తాడు – లోపలికి వెళ్లేసరికి శ్యామల వంటచేస్తోంది - బాబుని తల్చుకుని ఆదంపతులు ఇద్దరూ భోరున ఏడ్చారు. వారం రోజులున్నా కాని ఆతనిలో భార్యపై నిజమైన అనురాగం ప్రేమ కలగకపోగా ఎప్పటికైనా తను మళ్లా ఇంకో ... అపమారానికే పోవాలనుకుంటూ, నౌకరీ వెతుక్కోవడానికి బయటికిపోయాడు -

సాయంత్రం ముకుందరావు ఇంటికి వచ్చేసరికి శ్యామల మరో అందమైన ఇరవైఏళ్ల యువకుడు చాప మీదకూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు – లోపలికి వచ్చిచూచి అల్లాగే నిర్ఘాంతపోయి నిల్చుండిపోయాడు ముకుందరావు–

కృత్రిమ అలంకారాలేమీలేని సహజ సౌందర్యంతో చిక్కిపోయి బక్కపలచగాయున్నా ఎంతో అందంగావుంది శ్యామల ముఖం. తలనిండా మల్లెపూలు తెల్లనిచీర, నల్లనిజాకట్టు ఆమె పచ్చనిశరీరానికి ఎంతో అందంగావున్నాయి. మెళ్లో నల్లపూసలు. పసుపుకొమ్ముకట్టుకున్నబొందు. చేతికి గాజువి గాజులు తప్పించి ఇంకేమీలేకపోయినా ఎంతో అందంతో ఆనందంతో వెలిగిపోతున్నట్లుగా వుంది. ఇన్నాళ్లూ ఆమె తన సొత్తేనన్న ధీమాతో బానిసగా పడివుండాలనే భావంతో వుండే ముకుందరావుకి ఆమెలోని అందంచూడాల్సిన అవసరం కన్పించలేదు. కాని ఈనాడుఆమె ప్రక్కన మరో యువకుడు వుండడంతో తనభార్యలోని అందాన్ని స్పష్టంగా చూడగల్గాడు. ఆమె వల్ల ఆపరాయి వ్యక్తి ఎంతటి ఆనందాన్ని పొందగలడో ఊహించుకోసాగాడు. మళ్ళీ అంతలో ఇంకో ఆలోచన. ఇన్నాళ్లు తన భార్యా అందమైనదీ బలమైనదీగాదని,

తనని ఆకర్షించే యవ్వనం ఆమెలో లేదనేకదా! తను అపహార్యం చేస్తున్నాడు ? ... మళ్లీ ఆ యువకునివైపు శ్యామలవైపు తీవ్రంగా చూచాడు. కాని తనువచ్చినట్లుకూడా వారిద్దరూ గుర్తించకుండా ఆనందంలో మైమరచిపోయి కిలకిలా నవ్వుకొంటున్నారు, తన భార్యలోకూడా ఎంతో ఆకర్షణ, యవ్వనం, సరదాలు వున్నాయి. కాని తనే ఇన్నాళ్లూ గుర్తించుకో లేకపోయాడు. అయితే యీ పరాయి వ్యక్తి ఎన్నాళ్ళనుంచి తనభార్యతో - ఇంకా ఆలోచించుకోలేకపోయాడు. అనూయాజ్వాలలు చుట్టుముట్టాయి. కోపంతో కంపించిపోయాడు. పట్టశక్యంగాని అహంకారంతో "ఏయ్! ఈతడెవరు ?" అని గర్జించాడు —

"నాకు తెలిసిన స్నేహితుడులెండి. ఓ సారిమాచిపోదామనివచ్చాడు" అని భర్తకి చెప్పి లేచినిల్చుంది శ్యామల —

కోపంతో ముకుందరావు ముఖం కందగడ్డలా అయిపోయి ఆ యువకుని ముఖంలోకి చురచురా చూచాడు —

అతడు నవ్వుతుంటూ లేచి నిల్చుని "శ్యామలా! మని నే వెళ్ళొస్తా. ఆ అన్నట్లు నీ కోసం రంపంగి పువ్వులు తెచ్చా. ఇదిగో తీసుకో" అంటూ అతడు ఆమె చేతిలో పెట్టడం, ఆమె అతని అరచేతిలో తీసుకొని తలలో పెట్టుకోవడం కళ్లతో చూచేసరికి ముకుందరావు బుర్ర గిర్రున తిరిగిపోయింది. తన అనందాన్నంతా ఆ యువకుడు దోచుకుపోయేబంది పోటు దొంగలాకన్పించాడు - అతని ఎదుట తన భార్య అప్సరసలావుంది.

శ్యామల నవ్వుతూ ముకుందరావుతో "కూర్చోండి" అంది — కాని ముకుందరావుమాత్రం ఆయువకునివైపు తన భార్యవైపు తీవ్రంగా చూస్తున్నాడు. ఇంత ఘూటుగామాస్తున్న భర్తని శిక్షచెయ్యనట్లుగా వారిద్దరూ ఒకరివైపు ఒకరుకొంటె చూపులుమానుకొంటూ చిలిపినవ్వులు నవ్వుకొంటూంటే ముకుందరావు మనసులో ఆకాశం ఎత్తునా అనూయాజ్వాలలు లేచాయి.

"ఏయ్! ఒకపరాయి వ్యక్తితో ఇల్లావ్యవహరించడం సంసారికి లక్షణమేనా ?" అని గర్జించాడు—

"ఎల్లా ప్రవర్తిస్తే మాత్రం మేనెందుకు పనికొస్తానండీ!" అంది నవ్వుతూనే శ్యామల -

ఆయువకుడు ముసిముసి నవ్వులతో ముకుందరావు వైపు చూచాడు

ముకుందరావు ఆలకోపానికి తట్టుకోలేకపోయాడు. ఉద్రేకంతో ముందుకువచ్చి "కులటా! ఇన్నాళ్లూ నువ్వు ఆడే నాటకంఇదా? ఇప్పుడేనిన్ను నీకొడుకుదగ్గరకే పంపిస్తానుండు" అంటూ క్షణంలో మూలనున్న కర్రను తెచ్చి భార్యను కొట్టబోయేసరికి ఆమెకు అడ్డంనిల్చున్న ఆయువకునితలమీద తగిలిందా దెబ్బ —

"అయ్యో! అనసూయా!" అంటూ! గబీమని పట్టుకుంది శ్యామల. తలపాగామీద తగిలిన బలమైన దెబ్బకావడంచేత నుదురుమీంచి బొట బొటా రక్తంకార్తూంటే చీరకొంగుతో ఒత్తిపట్టుకొంది. అంతలో శ్రీధరం, రామయ్యగారువచ్చారు ముకుందరావు అల్లాగే శిలాప్రతిమలా నిల్చుండిపోయాడు. కూతురు తలమీంచి కారే రక్తాన్ని చూచిన రామయ్యగారు కోపంతో కళ్లలోంచి నిప్పులుకురిపిస్తూ "దుర్భాగ్యుడా! కట్టుకొన్న ఇల్లాలిని ఆదరించడంచేతకాక, కడుపునపుట్టిన బిడ్డ అంతర్దశలో నీపాదాలదగ్గరకువచ్చిన ఇల్లాలిని వేశ్యలు అవమానిస్తుంటే వాళ్లకి తాళంవేసినవుప్వో ఓ మగవాడివేనా ? సీతాదేవివంటి ఉత్తమసాధ్వికాబట్టే ఇన్నాళ్లూ ఓర్పుతోసహించింది; ఆమెలోని ఆధిక్యతని నీకు చూపించడానికే నాబిడ్డకి మగవేషం వేయించాము. ఒక పరపురుషుడు ప్రక్కనవుంటే గాని నీ భార్యలోని స్త్రీత్వాన్ని గుర్తించుకోలేకపోయావు. క్షణకాలం నీభార్యతో ఓ మగవ్యక్తి మాట్లాడితేనే సహించలేనంత అసూయ నీలో వున్నప్పుడు అహోరాత్రాదులు నువ్వు పరస్త్రీలోలుడవైవుంటే నీ భార్యఎంతగా దుఃఖిస్తూందో ఇప్పటికైనా అర్థమైందా ?" అని తీవ్రంగా అడిగాడు —

"ముకుందరావుగారూ! డబ్బువున్నంతకాలమే నీకు ఆనందాన్నిచ్చి, అదిలేకపోతే కుక్కకన్నకనా కష్టంగా గెంటినవేశ్యలోని ప్రియురాలి ప్రేమలో చిక్కుకుని పితృప్రేమనుకూడా విస్మరించావు. నీ భార్య ఎవరో నే నెన్నడూ తెల్సుకోలేకపోయినా ఆమెలోని మాతృప్రేమ, నేనూ ఆమె వంటి తల్లికే జన్మించినవాడనుకాబట్టి నాతల్లికి నా మీద ఎంత ప్రేమవుంటుందో ఈ పేదరాలికి అంత

ప్రేమవుంటుందని తక్షణం ఆవిడతో అర్ధరాత్రి సమయమని శంకించక వచ్చాను — నీ భార్య నాకు సోదరి వంటిది. సాటిమానవులని, మానవులుగా చూడ్డమే నాకు తెలుసు. ఆమె కష్టాలు గట్టెక్కించి నీ కళ్ళు తెరిపించడానికే ఆనాడు నీ జేబులో పర్సులాక్కున్నా, ఇదుగో నీ పర్సు నీడబ్బు — ఇన్నాళ్లూ నీ భార్యని సోదరిగా ఆదరించాను — నేను - బిడ్డగా చూచుకున్నాడు రామయ్య - ఈ నాటినుండైనా బుద్ధిగా ప్రవర్తించు. అటువంటి మహోత్తమ సాధ్వికి భర్త అని చెప్పుకోడానికికూడా తగనని ఈనాటికైనా గుర్తించుకో —" అన్నాడు రౌద్రాకారంతో శ్రీధరం -

"సాటి స్త్రీకోసం నారక్తాన్ని ధారపోసినా ఆమె ఆనందంగా సుఖించగలిగితే చాలు. ఇంకనుంచైనా మా అక్కయ్యను సేవించి జన్మతరింపచేసుకోండి ముకుందరావుగారూ ?" అంది అనసూయ —

అందరి మాటలు వినేసరికి ఒక్కసారిగా తన కళ్ళల్లోని చీకటి తెర తొలగిపోయింది. "శ్యామలా! నువ్వు దేవతవి. నీలోని పవిత్రతను అర్ధంచేసుకోలేక పోయిన కిరాతకుణ్ణి. నన్ను క్షమించవూ ?" అని పశ్చాత్తాపంతో భార్య రెండు చేతులుపట్టుకున్నాడు ముకుందరావు -

అందరి కళ్ళల్లోనూ ఆనందకాంతి వెల్లిపోతోంది. శ్రీధరం అనసూయ తలకు కట్టుకట్టి "అబ్బా! ఎంత దెబ్బతగిలింది!" అని నొచ్చుకొన్నాడు — అతనిహస్తస్పర్శకి సిగ్గుతో తలవంచుకొని శ్యామల దగ్గరగా నిల్చుంది -

"రామయ్య మామగారూ! నన్ను క్షమించండి. శ్రీధరంగారూ! మీరు నా యజమాని కొడుకైవుండీ మాయందు చూపిన ఆదరాభిమానానికి కృతజ్ఞుణ్ణి" అని అనసూయవైపు చూచి బిడియంతో "నా తప్పిదానికి మన్నించండి" అన్నాడు —

"ఫరవాలేదు నాయనా! బ్రతుకులో చీకటి వెలుగులు. కొన్నాళ్లు చీకటి - తర్వాత వెలుగు - మీకు చీకటిరాత్రులు గడిచాయి. ఇంకనుంచి చల్లగా సంసారంచేసుకోండి. "ఇవ్వాళనుంచే శ్రీధరంగారి కొట్లో మామూలుగా ప్రవేశించండి" అన్నాడు రామయ్య ఆనందంతో - "నాదొక్క కోరిక శ్రీధరంగారూ! మీరు కాదనక నెరవేర్చాలి" అంది శ్యామల-

"మా అన్నయ్యగారికెక్కడికీ వెళ్లకుండా కాపలా కాయమంటారా ?" నవ్వుతూ అడిగాడు —

"కాదు — మా చెల్లి అనసూయని కాపలా కాయండి. అన్ని విధాలా మా శ్రేయస్సుకోరేమీరు అనసూయను భార్యగా స్వీకరించి రామయ్యబాబుగారి భారాన్ని తీర్చమని నా వేడికోలు -"

ఆ మాటకోసమే ఎదురుచూస్తూన్న అనసూయ శ్రీధరం, సిగ్గుతో తలవంచుకున్నారు —

శ్యామలా ముకుందరావు, అనసూయ శ్రీధరం కల్సి రామయ్యగారికి నమస్కరిస్తోంటే శతసహస్రదీవనలిస్తూ ఆనందంతో ఉప్పొంగిపోయాడు ఆతండ్రి-

జై హింద్

పాత్రుడుగారి

బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 71354

కుంభకోణము బ్రాంచి : 7. సారంగపాణి కోవిల తూర్పువీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.